
సాక్షి
వికారాబాద్

మంగళవారం । 1 । ఏప్రిల్ । 2025



అనంతగిరి: వికారాబాద్‌లోని ఆలంపల్లి ఈద్గా వద్ద ముస్లింల ప్రత్యేక ప్రార్థనలు



అనంతగిరి: రంజాన్ శుభాకాంక్షలు తెలుపుతున్న స్పీకర్ ప్రసాద్‌కుమార్

భక్తిశ్రద్ధలతో రంజాన్ వేడుకలు

రంజాన్ పర్వదినాన్ని సోమవారం జిల్లా వ్యాప్తంగా ఘనంగా జరుపుకొన్నారు. ముస్లింలు ఈద్గాలు, మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు,అధికారులు ముస్లింలకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. అల్లా కృపతో అందరూ సంతోషంగా ఉండాలని కోరుకున్నారు. మత పెద్దలు ఖురాన్ విశిష్టతను, రంజాన్ పండుగ ప్రాధాన్యతను వివరించారు. తాండూరు పట్టణంలోని ఈద్గాలకు ముస్లింలు భారీగా తరలివచ్చి ప్రార్థనలు చేశారు. వికారాబాద్ పట్టణంలోని ఆలంపల్లి ఈద్గా వద్ద జరిగిన ప్రార్థనల్లో స్పీకర్ ప్రసాద్‌కుమార్ పాల్గొన్నారు.



తాండూరు టౌన్: పట్టణంలోని ఈద్గా వద్ద ప్రార్థన చేస్తున్న ముస్లింలు



అనంతగిరి: వికారాబాద్ పట్టణంలో..

న్యూస్‌రీల్

రోడ్డు నిర్మాణానికి జాయింట్ సర్వే



రోడ్డు వెళ్లే సర్వే నంబర్లను పరిశీలిస్తున్న అధికారులు

తుర్కయంజాల్: సాగర్ రహదారి నుంచి తొర్రూర్ స్మూప్స్ ఐస్‌క్రీమ్ కంపెనీ వరకు హెచ్‌ఎండీఏ వేయనున్న 60 ఫీట్ల రోడ్డు నిర్మాణానికి సోమవారం రెవెన్యూ, హెచ్‌ఎండీఏ అధికారులు సంయుక్తంగా సర్వే నిర్వహించారు. ఎస్‌ఎస్‌ఆర్ కన్వెన్షన్ హాల్ సమీపంలోని కల్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయం కమాన్ నుంచి సాయిప్రియ లే అవుట్‌లోని హైటెన్షన్ లైన్ కింద నుంచి రోడ్డు వేయాలని భావిస్తున్నారు. క్షేత్ర స్థాయిలో పలు ఇళ్ల నిర్మాణాలు పూర్తయి, వాటిల్లో అనేక మంది నివసిస్తున్నారు. ఇలాంటి సమయంలో ఒక్కసారిగా రోడ్డు నిర్మాణం అంటూ అధికారులు సర్వే నిర్వహిస్తుండటం ఇళ్ల నిర్మాణదారుల్లో గుబులు రేపుతోంది. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలోనూ ఎన్నికలకు ముందు ఇదే రోడ్డు నిర్మాణానికి పలుమార్లు అధికారులు పరిశీలన చేశారు. అయినప్పటికీ కార్యరూపం దాల్చలేదు. తాజాగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తిరిగి సర్వే నిర్వహించారు. రోడ్డు నిర్మాణానికి అడ్డుగా ఉన్న నిర్మాణాలు, ప్లాట్లు, పొలాల గురించి ఉన్నతాధికారులకు నివేదిస్తామని అధికారులు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ అనంత్ రెడ్డి, తహసీల్దార్ సుదర్శన్ రెడ్డి, హెచ్‌ఎండీఏ అసిస్టెంట్ సిటీ ప్లానర్ శైలజ, మండల సర్వేయర్ జ్యోతి పాల్గొన్నారు.

శ్వాస మీద ధ్యాస పెట్టి ధ్యానం చేయాలి



బ్రహ్మర్షి ప్రేమ్‌నాథ్‌గుప్తాతో ధ్యానులు

ఇబ్రహీంపట్నం: శక్తి ఉన్నచోట వైరసులు సోకవని బ్రహ్మర్షి ఎం.ప్రేమ్‌నాథ్‌గుప్తా అన్నారు. ఇబ్రహీంపట్నంలోని జై హనుమాన్ ధ్యాన కేంద్రంలో సోమవారం ప్రత్యేక మెడిటేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ధ్యానులను ఉద్దేశించి మాట్లాడారు. దేహానికి ఆరోగ్యం, మనస్సుకు శాంతి, బుద్ధికి ఆలోచన, ఆత్మకు శక్తి, సర్వాత్మకు ముక్తి అవసరమన్నారు. అందుకు సాధన ముఖ్యమని తెలిపారు. శ్వాస మీద ధ్యాస పెట్టి ధ్యానం చేయడం ద్వారా మన సంకల్పాలు, ఆశయాలు సిద్ధించడమేగాక మనలో ఒక శక్తి ఉద్భవిస్తుందన్నారు. పత్రీజీ చూపిన మార్గంలో పయనించి ముక్తి పొందాలని సూచించారు.

తాటిచెట్టు పైనుంచి పడి గీత కార్మికుడి మృతి



బుచ్చయ్యగౌడ్ మృతదేహం వద్ద విలపిస్తున్న కుటుంబ సభ్యులు

మంచాల: తాటి చెట్టు పైనుంచి పడి గీత కార్మికుడు మృతిచెందిన ఘటన మండలంలోని ఆరుట్లలో చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పాశం బుచ్చయ్యగౌడ్(65) గీత కార్మికుడు. ఎప్పటిలాగే సోమవారం కల్లు గీసేందుకు తాటి చెట్టు ఎక్కాడు. ప్రమాదవశాత్తు మోకు జారిపోవడంతో కిందపడి తీవ్రగాయాలై అక్కడికక్కడే చనిపోయాడు. ఇతనికి ఇద్దరు కూతుళ్లు, ఇద్దరు కుమారులు ఉన్నారు. కాంగ్రెస్ నాయకుడు విష్ణువర్ధన్‌రెడ్డి, మంచాల పీఏసీఎస్ చైర్మన్ హన్మంత్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు చీరాల రమేశ్ తదితరులు మృతుడి కుటుంబాన్ని పరామర్శించారు.

454 యూనిట్లు



వ్యవసాయ యంత్ర పరికరాలు

మహిళా రైతులకు 50శాతం రాయితీతో యంత్ర పరికరాలు

- ఆధునిక వ్యవసాయాన్ని ప్రోత్సహించేందుకు కేంద్రం నిర్ణయం
- రూ.3 వేల నుంచి రూ.5 లక్షల వరకు యంత్రాల కొనుగోలుకు అవకాశం
- ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తుల ఆహ్వానం

వికారాబాద్: వ్యవసాయంలో యాంత్రీకరణను ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం 50 శాతం రాయితీపై యంత్ర పరికరాలు అందజేయాలని నిర్ణయించింది. ఈ పథకం కేవలం మహిళా రైతులకే వర్తించనుంది. ఎస్‌ఎంఏఎం పథకం పేరుతో అమలు చేయనున్నారు. కిసాన్ సంఘాలు, స్వయం సహాయక సంఘాల ద్వారా కూడా ఈ పరికరాల కొనుగోలుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. పదేళ్ల క్రితం వరకు రాష్ట్ర ప్రభుత్వం యంత్రలక్ష్మి పేరుతో వ్యవసాయ పరికరాలు అందిస్తూ వచ్చిన విషయం తెలిసిందే. అయితే రైతు బంధు, రైతు బీమా పథకాల అమలుతో రాయితీ యంత్రాలకు మంగళం పాడింది. తాజాగా రాష్ట్ర ప్రభుత్వం కూడా వ్యవసాయానికి యంత్ర పరికరాలు అందించేందుకు బడ్జెట్‌లో నిధులు కేటాయించినా ఇంకా పథకాన్ని ప్రకటించలేదు. ఈలోగా కేంద్ర ప్రభుత్వం మహిళా రైతులకు రాయితీపై యంత్ర పరికరాలు ఇచ్చేందుకు సిద్ధమైంది. ఇప్పటికే వ్యవసాయ శాఖ జిల్లా అధికారికి పథకం విధి విధానాలతో ఉత్తర్వులు జారీ చేసింది. అర్హులైన వారి నుంచి ఆన్‌లైన్ దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు.

అర్హులు ఎవరంటే..

2024 – 25 వ్యవసాయ సంవత్సరానికి గాను ఈ పథకం వర్తింపజేయనున్నారు. రూ.3 వేల నుంచి గరిష్టంగా రూ.5 లక్షల వరకు రాయితీ వర్తించనుంది. వంద శాతం మహిళా రైతులకే పథకం అమలు చేయాలని నిర్ణయించారు. ఇందులో ఎస్సీ, ఎస్టీ మహిళా రైతులకు రిజర్వేషన్ ప్రాతిపదికన కోటా కేటాయించగా మిగతా సామాజిక వర్గాలకు చెందిన మహిళా రైతులు జనరల్ కేటగిరీ కింద దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. చిన్న, సన్నకారు రైతులతో పాటు పెద్ద రైతులు కూడా ఈ పథకానికి అర్హులు. ఇందులో ఎకరంలోపు వ్యవసాయ భూమి కలిగిన రైతులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. రూ.లక్ష కంటే ఎక్కువ రాయితీ వర్తించే యంత్ర పరికరాలకు దరఖాస్తు చేసుకోవాలంటే ఒక ఎకరం కంటే ఎక్కువ వ్యవసాయ భూమి కలిగి ఉండాలి. ఎకరంలోపు భూమి ఉన్నవారు రూ.లక్ష లోపు రాయితీ వర్తించే యంత్ర పరికరాలకు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. వ్యవసాయ డ్రోన్లు, మినీ ట్రాక్టర్ లాంటి యంత్ర పరికరాలు కావాలంటే కనీసం రెండున్నర ఎకరాల పొలం ఉండాలి. రైతులు దరఖాస్తు చేసుకున్న తర్వాత జిల్లాస్థాయి కమిటీ అర్హులను ఎంపిక చేస్తుంది.

కేటగిరీల వారీగా..

ఈ పథకం కింద ఎస్సీ, ఎస్టీ, జనరల్ కేటగిరీలకు చెందిన మహిళా రైతులకు 454 యూనిట్లు మంజూరయ్యాయి. జనరల్ కేటగిరి కింద చిన్న, సన్నకారు రైతులతో పాటు పెద్ద రైతులకు 338 యూనిట్లు కేటాయించారు. ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన మహిళా రైతులకు 77 యూనిట్లు, ఎస్టీ సామాజిక వర్గానికి చెందిన చిన్న, సన్నకారు, పెద్ద రైతులకు 39 యూనిట్లు కేటాయించారు.

నియోజకవర్గాల వారీగా..

వికారాబాద్ నియోజకవర్గానికి ఎస్సీలకు 25 యూనిట్లు, ఎస్టీలకు 11, జనరల్ 116 మొత్తం 152 యూనిట్లు కేటాయించారు. పరిగి నియోజకవర్గానికి ఎస్సీలకు 17, ఎస్టీలకు 09, జనరల్‌కు 77,మొత్తం 103 యూనిట్లు కేటాయించారు. కొడంగల్ నియోజకవర్గానికి ఎస్సీలకు20,ఎస్టీలకు 11,జనరల్‌కు 79,మొత్తం 110 యూనిట్లు కేటాయించారు. తాండూరు నియోజకవర్గానికి ఎస్సీలకు 15 యూనిట్లు, ఎస్టీలకు 8, జనరల్‌కు 64, మొత్తం 89 యూనిట్లు కేటాయించారు.ఇందులో కాళ్లు,చేతుల సాయంతో పని చేసే స్ప్రేయర్లు, బ్యాటరీతో పని చేసే స్ప్రేయర్లు ఉన్నాయి. నాగలి, గొర్రు,ఎరువులు, విత్తనాలు వేసే ట్రాక్టర్‌కు వినియోగించే పరికరాలు,పురుగు మందు స్ప్రే చేసేందుకు వినియోగించే డ్రోన్లు కూడా ఉన్నాయి. పవర్ వీడర్లు, బ్రష్ కటర్లు తదితర యంత్ర పరికరాలను రాయితీపై అందజేయనున్నారు.

మహిళా రైతులకే అవకాశం



ఈ పథకం మహిళా రైతులకు మాత్రమే..ఆసక్తి ఉన్న వారు సీఎస్సీ సెంటర్‌కు వెళ్లి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. వారి వద్ద దరఖాస్తు ఫారాలు అందుబాటులో ఉన్నాయి.ఆధార్, మొబైల్ నంబర్, బ్యాంక్ ఖాతా వివరాలు,పాస్‌సైజ్ ఫొటో తీసుకెళ్లాలి. సీఎస్సీ సెంటర్ నిర్వాహకులు దరఖాస్తు పూర్తి చేసి ఐడీ కేటాయిస్తారు.ఇతర వివరాలకు మండలంలోని వ్యవసాయ శాఖ కార్యాలయంలో సంప్రదించాలి.

– మోహన్‌రెడ్డి, డీఏఓ

ఎక్కువ దరఖాస్తులు వచ్చేలా చూడండి



వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ ప్రతీక్‌జైన్, ఇతర అధికారులు

కలెక్టర్ ప్రతీక్ జైన్

అనంతగిరి: రాజీవ్ యువ వికాసం పథకానికి వీలైనంత ఎక్కువ మంది అర్హులు దరఖాస్తు చేసుకునేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులను ఆదేశించారు. సోమవారం నగరం నుంచి రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క రాజీవ్ యువ వికాసం పథకంపై అన్ని జిల్లాల కలెక్టర్లు,అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. ఈ నెల 5వ తేదీ లోపు రాజీవ్ యువ వికాసం పథకానికి దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. అర్హులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ సుధీర్, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి శ్రీనివాస్, ఎస్సీ సంక్షేమ శాఖ జిల్లా అధికారి మల్లేశం, డీటీడీఓ కమలాకర్‌రెడ్డి, డీపీఓ జయసుధ, బీసీ సంక్షేమ శాఖ జిల్లా అధికారి ఉపేందర్, మైనార్టీ సంక్షేమ శాఖ జిల్లా హనుమంత్‌రావు తదితరులు పాల్గొన్నారు.

పరుపుల కంపెనీలో అగ్ని ప్రమాదం

- వ్యాపించిన దట్టమైన పొగలు
- రంజాన్ వేళ భయకంపితులైన స్థానికులు
- మంటలు అదుపులోకి తెచ్చిన అగ్నిమాపక సిబ్బంది

పహాడీషరీఫ్: ఓ పరుపుల తయారీ కంపెనీలో అగ్ని ప్రమాదం చోటు చేసుకున్న సంఘటన పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. జనావాసాల నడుమ చోటు చేసుకున్న ఈ ప్రమాదంతో రంజాన్ వేళ స్థానికులు భయకంపితులయ్యారు. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. జల్‌పల్లి గ్రామంలోని ప్రధాన రహదారిపై ఉన్న ఖాజా బేకరీ గల్లీలో చార్మినార్ ప్రాంతానికి చెందిన మహమూద్ కొన్నాళ్లుగా పరుపుల తయారీ పరిశ్రమను నిర్వహిస్తున్నాడు. సోమవారం మధ్యాహ్నం 2 గంటల సమయంలో ఒక్కసారిగా షార్ట్ సర్క్యూట్ ఏర్పడి మంటలు వ్యాపించి పరుపులకు అంటుకున్నాయి. చూస్తుండగానే దట్టమైన పొగలు రావడంతో అందులో ఉన్న సిబ్బంది ప్రాణభయంతో బయటికి పరుగులు తీశారు. సమాచారం అందుకున్న పహాడీషరీఫ్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. ప్రమాదం జరిగిన గోడౌన్‌లో సిలిండర్ ఉండడం.. చుట్టూ నివాసాలు ఉండడంతో తమకు ఎలాంటి ముప్పు వాటిల్లుతుందోనని స్థానికులు భయాందోళనలకు గురయ్యారు. దాదాపు 50 నిమిషాల తర్వాత అక్కడికి చేరుకున్న ఫైరింజన్ మంటలను అదుపులోకి తీసుకొచ్చింది. ఫైర్ సిబ్బంది సిలిండర్‌ను బయటికి తేవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఈ విషయమై ఎలాంటి ఫిర్యాదు అందనందున కేసు నమోదు చేయలేదని పోలీసులు తెలిపారు.

'ఫ్యూచర్' బాస్ ఎవరు?

త్వరలోనే ఫోర్త్ సిటీ అథారిటీకి కమిషనర్ నియామకం

- యంగ్ అండ్ డైనమిక్ ఐఏఎస్ అధికారికి పగ్గాలు
- యువ ఐఏఎస్‌లు శశాంక, హరీశ్, గోపి పేర్ల పరిశీలన



ఎస్.హరీశ్



గోపి



కె.శశాంక

సాక్షి, రంగారెడ్డి జిల్లా: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి డ్రీమ్ ప్రాజెక్ట్ అయిన ఫ్యూచర్ సిటీ అభివృద్ధిలో కీలకమైన అడుగు పడనుంది. ఈ మేరకు ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ (ఎఫ్‌సీడీఏ)కి కమిషనర్‌ను నియమించనున్నారు. చురుకైన యువ ఐఏఎస్ అధికారిని ప్రాజెక్ట్ సారథిగా నియమిస్తే బాగుంటుందనే భావనలో సీఎం రేవంత్ ఉన్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా అంతర్జాతీయ ప్రమాణాలతో ప్రతిపాదిస్తున్న ఫోర్త్ సిటీని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుంటోంది. ఈ నేపథ్యంలోనే ఎఫ్‌సీడీఏ పరిధిని ప్రత్యేకంగా భావిస్తోంది. ప్రపంచ ప్రఖ్యాత ఐటీ, ఫార్మా, క్రీడారంగాలకు ప్రాధాన్యతనిస్తున్న సర్కారు.. ఆ మేరకు జోన్‌లను కూడా నిర్దేశిస్తోంది. వీటన్నింటినీ పరిగణనలోకి తీసుకుంటున్న ప్రభుత్వ పెద్దలు అంతర్జాతీయ నగరాలపై అవగాహన ఉన్న అధికారులకు దీని పాలనాపగ్గాలు కట్టబెట్టే దిశగా ఆలోచన చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే.. గతంలో జిల్లా కలెక్టర్లుగా వ్యవహరించిన కె.శశాంక (2013), డాక్టర్ ఎస్.హరీశ్ (2015) పేర్లను ప్రభుత్వం పరిశీలిస్తోంది. ఈ ప్రాంతంపై వీరికి స్పష్టమైన అవగాహన ఉండడం కలిసొచ్చే అంశంగా భావిస్తోంది. అలాగే గోపి (2016) పేరును సైతం పరిశీలిస్తున్న సర్కారు.. త్వరలోనే తుది నిర్ణయాన్ని ప్రకటించే అవకాశముంది.

ఫోర్త్ సిటీ అభివృద్ధే లక్ష్యం

హైదరాబాద్, సికింద్రాబాద్, సైబరాబాద్ తర్వాత గ్రేటర్‌లో ఫోర్త్ సిటీ అవసరం ఉందని సీఎం రేవంత్ నిర్ణయించారు. 765.28 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో ఫోర్త్ సిటీని అభివృద్ధి చేయాలన్నది సర్కార్ లక్ష్యం. మహేశ్వరం, ఆమన్‌గల్లు, కడ్తాల్, కందుకూరు, ఇబ్రహీంపట్నం, యాచారం, మంచాల తదితర ఏడు మండలాల్లోని 56 గ్రామాలు ఎఫ్‌సీడీఏ పరిధిలోకి వస్తాయి. ఇప్పటికే ఎఫ్‌సీడీఏ కోసం కొత్తగా 90 పోస్టులకు మంత్రివర్గం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది వీటిలో 34 రెగ్యులర్ పోస్టులు కాగా.. మిగిలిన 56 పోస్టులను ఔట్ సోర్సింగ్/కాంట్రాక్టు పద్ధతిలో భర్తీ చేస్తారు. ఎఫ్‌సీడీఏ కమిషనర్ నియామకం పూర్తవగానే ఫ్యూచర్ సిటీ నిర్మాణం మరింత వేగం పుంజుకుంటుందని అధికారులు చెబుతున్నారు.

నాలుగేళ్లలో కార్యరూపం

ఇప్పటికే ఫోర్త్ సిటీలో యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ నిర్మాణం ప్రారంభంకాగా పనులు చకచకా సాగుతున్నాయి. ఉగాది తర్వాత ఆర్టిఫిషీయల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సిటీ నిర్మాణానికి శంకుస్థాపన చేసేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. ఇదే సమయంలో ఫ్యూచర్ సిటీకి అన్ని ప్రాంతాల నుంచి అనుసంధానం చేసేందుకు గ్రీన్ ఫీల్డ్ రేడియల్ రోడ్ల నిర్మాణానికి సైతం ప్రణాళికలు సిద్ధమయ్యాయి. మరోవైపు ఫ్యూచర్ సిటీలో పలు జాతీయ, అంతర్జాతీయ సంస్థల ఏర్పాటుకు సంబంధించిన ప్రక్రియను సైతం వేగవంతం చేసింది. వచ్చే నాలుగేళ్లలో ఫ్యూచర్ సిటీకి ఓ రూపం తీసుకువచ్చేలా పక్కా ప్రణాళికతో ముందుకు వెళ్తోంది.



మర్పల్లిలోని రేషన్ దుకాణంలో బియ్యం పంపిణీ చేస్తున్న డీలర్(ఫైల్)

ఆ కోటా ఎప్పటికో?

- పదేళ్ల క్రితం రేషన్ కార్డుల జారీ సమయంలో వేల సంఖ్యలో చిన్నారులు
- కార్డుల్లో పేరు ఉన్నా కోటా అలాట్‌మెంట్ కాని వైనం
- ప్రస్తుతం వారి వయస్సు 10 నుంచి 15 సంవత్సరాలు
- సభ్యులను చేర్చే విషయంలో మీనమేషాలు

వికారాబాద్: రేషన్ కార్డుల్లో కొత్తపేర్ల నమోదు, కార్డుల జారీ సమయంలో ఐదేళ్ల లోపు చిన్నారులకు నేటికీ కోటా అలాట్‌మెంట్ లేకపోవడం లబ్ధిదారుల్లో ఆందోళన కలిగిస్తోంది. పదేళ్ల క్రితం అప్పటి ప్రభుత్వం రేషన్ కార్డులు మంజూరు చేసింది. ఆ సమయంలో ఐదేళ్ల లోపు చిన్నారులు వేల సంఖ్యలో ఉన్నారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు వారికి బియ్యం, ఇతర సరుకుల అలాట్‌మెంట్ లేదు. ప్రస్తుతం వారి వయస్సు 10 నుంచి 15 సంవత్సరాల వరకు ఉంటుంది. కార్డులు జారీ చేసిన తర్వాత పుట్టిన పిల్లలు, కొత్తగా పెళ్లి చేసుకొని అత్తారింటికి వచ్చిన వారి పేర్లను కార్డుల్లో చేర్చలేదు. గత ప్రభుత్వం ఒక్కసారి, ప్రస్తుత ప్రభుత్వం రెండు సార్లు కొత్త రేషన్ కార్డులు జారీ చేసినా సభ్యులను మాత్రం చేర్చలేదు. బీఆర్‌ఎస్ హయాంలో ఆహార భద్రతా పథకంలో భాగంగా లబ్ధిదారులను ఎంపిక చేశారు. ఆ సమయంలో కుటుంబాల్లో ఎంత మంది ఉన్నారో వారి పేర్లను అందులో చేర్చింది. గడిచిన పదేళ్ల కాలంలో ఆ కుటుంబాల్లో అదనంగా చాలా మంది సభ్యులు వచ్చి చేరారు. సాంకేతిక సమస్యల కారణంగా కొందరి పేర్లు తొలగించబడ్డాయి. చనిపోయిన వారి పేర్లను రేషన్ కార్డుల నుంచి వెంటనే తొలగిస్తున్న ప్రభుత్వం కొత్త సభ్యుల చేర్చే విషయంలో మాత్రం ఆసక్తి చూపడం లేదు. ఇటీవల జిల్లాలో 23 వేల కొత్త రేషన్ కార్డులు మంజూరైనా కొత్త సభ్యుల చేరిక జరగలేదు. ఉదాహరణకు పేర్ల చేరిక కోసం వంద మంది దరఖాస్తు చేసుకుంటే పది శాతం మంది పేర్లే కార్డుల్లో చేర్చారు.

పెండింగ్‌లో 50 వేల దరఖాస్తులు

గత ప్రభుత్వం ఆహారభద్రత లబ్ధిదారులను ఎంపిక చేసి జాబితాను ఆన్‌లైన్‌లో ఉంచింది. ఈ ప్రక్రియ జరిగి పదేళ్లు దాటిపోయింది. ఆ సమయంలో రేషన్ కార్డులు జారీ చేయకుండా ఏడాదికి సరిపడా కూపన్లు ఇచ్చింది. ఆ తర్వాత కూపన్లు ఇవ్వలేదు. కొంత కాలం పాటు నెట్ సెంటర్లలో కూపన్లు తీసుకొని సరుకులు తెచ్చుకున్నారు. అనంతరం బయోమెట్రిక్ విధానం అమలు చేయటంతో రేషన్ దుకాణాల్లో సరుకులు పొందుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాది దాటినా రేషన్ కార్డుల్లో కొత్త సభ్యుల చేరికపై ఎలాంటి తీసుకోకపోవడంపై అర్హులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో ఇప్పటి వరకు పేర్ల చేరిక కోసం దాదాపు 50 వేలకు పైగా అర్జీలు పెండింగ్‌లో ఉన్నాయి. దరఖాస్తు చేసుకోని వారు సైతం వేల సంఖ్యలో ఉన్నారు. వీరందికీ కార్డుల్లో చోటు లభిస్తే మరో 300 మెట్రిక్ టన్నుల బియ్యం కోటా పెరగనుంది. రేషన్ సరఫరాలో అవకతవకలను అరికట్టేందుకు అనేక సంస్కరణలు ప్రవేశపెడుతున్న పౌరసరఫరాల శాఖ లబ్ధిదారులకు త్వరితగతిన న్యాయం చేసే విషయంలో మాత్రం పట్టీపట్టనట్టుగా వ్యవహరిస్తోంది.

జిల్లాలో రేషన్ కార్డులు 2,63,573

జిల్లాలో 20 మండలాలు 588 రేషన్ దుకాణాలు ఉన్నాయి. ప్రస్తుత ప్రభుత్వం ప్రజా పాలనలో భాగంగా రేషన్ కార్డుల కోసం దరఖాస్తులు స్వీకరించింది. 23,542 మంది అర్జీలు పెట్టుకున్నారు. వీటిని క్షేత్రస్థాయిలో పరిశీలించిన అధికారులు 22,404 మందిని అర్హులుగా గుర్తించారు. మిగతా 1,138 దరఖాస్తులను రిజెక్టు చేశారు. కొత్తగా మంజూరైన వాటిని కలుపుకొని జిల్లాలో 2,63573 కార్డులు ఉన్నాయి. వీటికి సంబంధించి ప్రతి నెలా 5,603 మెట్రిక్ టన్నుల బియ్యం పంపిణీ చేస్తున్నారు.

ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలి

రేషన్ కార్డుల్లో తమ పేర్లు చేర్చాలంటూ చాలా మంది దరఖాస్తు చేసుకున్నారు. వచ్చిన అర్జీలను ఎప్పటికప్పుడు ప్రభుత్వానికి చేరవేశాం. కార్డుల్లో పేర్లు చేర్చాలంటే ప్రభుత్వం నుంచి ఆదేశాలు రావాలి. ఉత్తర్వులు రాగానే ప్రక్రియను ప్రారంభిస్తాం.

– మోహన్‌బాబు, డీసీఎస్‌ఓ, వికారాబాద్

క్లుప్తంగా

శివాలయంలో ప్రత్యేక పూజలు


హోమంలో పాల్గొన్న దంపతులు

దుద్యాల్: మండల పరిధిలోని పోలేపల్లి గ్రామంలోని తంగెళ్లగడ్డ శివాలయంలో సోమవారం ప్రత్యేక హోమాలు చేశారు. గ్రామానికి చెందిన పలువురు దంపతులు స్వామి వారికి పూజలు నిర్వహించారు. రుద్ర హోమం, రుద్రాభిషేకం అనంతరం శివాష్టకం, బిల్వాష్టకం, అష్టోతర నామాలు పఠించారు. అనంతరం ఆలయ అర్చకులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

పార్టీ బలోపేతానికి ఐక్యంగా పనిచేయాలి

జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి

షాబాద్: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను క్షేత్రస్థాయిలో ప్రజల్లోకి తీసుకెళ్లి రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎలుగంటి మధుసూదన్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని దామర్లపల్లి గ్రామానికి చెందిన బీజేపీ కార్యకర్తలు కుమార్, శివ, శివకుమార్, రాజు, అనిల్, పవన్, మల్లేశ్, మాధవాచారితో పాటు మరో 15 మంది బీజేపీ నుంచి కాంగ్రెస్‌లో చేరారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధుసూదన్ రెడ్డి వారికి పార్టీ కండువా కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్టీ బలోపేతానికి ఐక్యంగా పనిచేయాలన్నారు. విభేదాలకు తావులేకుండా పార్టీ పటిష్టత, స్థానిక సంస్థలన్నింటిలో విజయమే లక్ష్యంగా ముందుకు సాగాలని సూచించారు. పార్టీ పటిష్టతకు పనిచేసిన వారికి గుర్తింపు ఉంటుదన్నారు. పేదల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని, అర్హులందరికీ రేషన్ కార్డులు వస్తాయని, అర్హత కలిగిన ప్రతీ కుటుంబానికి ఇందిరమ్మ ఇళ్లు అందుతాయని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కావలి చంద్రశేఖర్, ఎంపీటీసీ మాజీ సభ్యులు కుమ్మరి చెన్నయ్య, అశోక్, మాజీ సర్పంచ్‌లు లింగం, జనార్దన్‌రెడ్డి, ఖాజామియా, శ్రీనివాస్‌గౌడ్, రవీందర్‌నాయక్, మహేందర్‌గౌడ్, నాయకులు రవీందర్‌యాదవ్, సుభాష్‌రెడ్డి, మాధవరెడ్డి, మల్లారెడ్డి, బురాన్ దస్తగిరి, సత్యం, శేఖర్, రాఘవేందర్, చేవెళ్ల స్వామి పాల్గొన్నారు.

తిట్టాడని చంపేశాడు..

- ఫైనాన్స్ వ్యాపారి దారుణ హత్య
- సహజీవనం చేస్తున్న మహిళ కుమారుడి ఘాతుకం

చైతన్యపురి: తిట్టాడని డైలీ ఫైనాన్స్ వ్యాపారిని అతడితో సహజీవనం చేస్తున్న మహిళ కుమారుడు దారుణంగా హత్య చేసిన సంఘటన సరూర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ సైదిరెడ్డి వివరాల ప్రకారం.. పులిమామిడికి చెందిన బచ్చు వెంకటేశ్వర్లు అలియాస్ రాజు(47) కొన్నాళ్లుగా కర్మన్‌ఘాట్‌లోని జానకీ ఎన్‌క్లేవ్‌లో నివాసం ఉంటున్నాడు. అతడి భార్య విడిపోవటంతో ఒక్కడే ఉంటూ డైలీ ఫైనాన్స్ వ్యాపారం చేస్తున్నాడు. సూర్యాపేట జిల్లా శ్రీనివాసపురం గ్రామానికి చెందిన మామిడి గురవమ్మ భర్త మృతి చెందటంతో కుమారుడు పవన్, కుమార్తెతో కలిసి అదే ప్రాంతంలో నివాసం ఉంటోంది. ఈ క్రమంలో వెంకటేశ్వర్లు, గురవమ్మలకు పరిచయం ఏర్పడింది. గురవమ్మ కుమారుడు, కుమార్తె మరో ఇంట్లో ఉంటుండగా ఆమె వెంకటేశ్వర్లుతో సహజీవనం చేస్తోంది. కొన్నాళ్లుగా వెంకటేశ్వర్లు గురవమ్మ ఆమె పిల్లాలను దూషిస్తున్నాడు. ఆదివారం ఉగాది నేపథ్యంలో గురవమ్మ తన కుమారుడు, కుమార్తెను ఇంటికి పిలిచింది. రాత్రి వెంకటేశ్వర్లు, గురవమ్మ, పవన్‌ల మధ్య గొడవ జరగడంతో పవన్ కత్తితో వెంకటేశ్వర్లుపై దాడి చేశాడు. అనంతరం సరూర్‌నగర్ ఠాణాకు సమాచారం అందించాడు. దీంతో ఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు అపస్మారక స్థితి లో ఉన్న వెంకటేశ్వర్లును చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. హత్యకు పాల్పడిన పవన్ పరారీలో ఉన్నాడని, మృతుడి మే నల్లుడి ఫిర్యాదు మేరకు గురవమ్మతో పాటు ఆమె కుమారుడు పవన్, కుమార్తెలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

బెట్టింగ్ భూతం.. బలవుతున్న జీవితం

ఓ వైపు ప్రభుత్వం ఆన్లైన్ బెట్టింగ్ యాప్‌లపై విచారణకు సిట్ ఏర్పాటు చేసి సామాజిక వ్యసనంగా మారిన ఆన్లైన్ గేమింగ్‌లపై నిషేధాజ్ఞలు విధించింది. అయినప్పటికీ కొందరు బుకీలు ఐపీఎల్ మ్యాచ్‌లకు పందేలు నిర్వహిస్తున్నట్లు.. రూ.లక్షల్లో ఈ దందా సాగుతున్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి.

ఆన్‌లైన్ వేదికగా పందేలు

- ఐపీఎల్ మ్యాచ్‌లకు రూ.లక్షల్లో అప్పులు
- తీర్చే మార్గం లేక దా'రుణాలు'



పరిగి: క్రికెట్ బెట్టింగ్‌తో యువత ప్రాణాల మీదికి తెచ్చుకుంటున్నారు. ఐపీఎల్ పోటీలు ప్రారంభమవడంతో రూ.లక్షల్లో బెట్టింగులకు పాల్పడుతున్నారు. జిల్లాలోని నలుమూలల కొందరు యువతను దీనికి ఉసిగొలిపి ప్రాణాల మీదకు తెస్తున్నారు. ఐపీఎల్ ప్రారంభం అయిన నాటి నుంచి జిల్లాలో ఈ వ్యవహారం చాపకింద నీరుగా విస్తరిస్తోంది. పోలీసులు పైకి అలాంటిది ఏమీ లేదని చెబుతున్నా మూలాలను వెతికి పట్టి అడ్డుకట్ట వేయడంలో విఫలమయ్యారనే విమర్శలు వినిపిస్తున్నాయి. జిల్లాలోని పట్టణ, మండల, గ్రామాల్లో కొందరు వ్యాపారస్తులు, యువత పోలీసుల కళ్లుగప్పి ఈ తంతును యథేచ్ఛగా నడిపిస్తున్నారు. ఈ మోజులో పడి లక్షల రూపాయలు పోగొట్టుకుంటున్న యువత సంఖ్య క్రమంగా పెరుగుతోంది. చిన్న పెద్ద అనే తేడాలేకుండా స్థాయికి తగ్గట్టు వందల నుంచి వెయ్యి, వెయ్యి నుంచి లక్షల వరకు పందెం కాస్తున్నారు. హోటళ్లు, బేకరీలు, కిరాణం, శీతల పానీయాల దుకాణాలు, పాన్‌షాపులు వీటికి అడ్డాగా మారుతున్నాయి. సులభంగా డబ్బు సంపాదించవచ్చు అనే అత్యాశతో యువత పెడదోవ పడుతున్నారు.

యువత, విద్యార్థులే టార్గెట్

ఈ ఏడాది ఐపీఎల్ మ్యాచ్‌ల బెట్టింగ్ వ్యవహారం సాంకేతికంగా దూసుకుపోతోందని సమాచారం. వాట్సాప్‌లాంటి సామాజిక మాధ్యమాలతో పాటు యాప్‌లను ఉపయోగించుకుంటున్నట్లు తెలుస్తోంది. బుకీలు అత్యాధునిక పరిజ్ఞానంతో యువతను, విద్యార్థులను లక్ష్యంగా చేసుకొని దందాను కొనసాగిస్తున్నారు. టాస్‌వేసిన క్షణం నుంచి చివరి బంతి వరకు బెట్టింగ్‌లను బంతి బంతికి, మ్యాచ్‌కి ఇలా ఆట ముగిసే వరకు బెట్టింగ్ వేస్తున్నా రు. యాప్‌లలో కాస్తున్న వారికి నిర్వాహకులు జట్టుకు రేటింగ్ ఇస్తూ బురిడీ కొట్టిస్తున్నారు. దీంతో పాటు ఇద్దరు వ్యక్తుల, యువకుల మధ్య బంతికి లేదా, మ్యాచ్‌కి బెట్టింగ్ కాస్తుంటారు. గెలుపొందిన వారికి ఫోన్ పే, గూగుల్ పే ద్వారా డబ్బు చెల్లిస్తున్నారు. ఓడిపోయిన వారు డబ్బులు చెల్లించకపోతే యువకులు గొడవలకు దిగుతున్నారు. కొంత మంది యవకులు అప్పులు చేసి బెట్టింగ్ వేసి ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు.

పోలీసులకు చిక్కకుండా కోడ్ లాంగ్వేజ్

ఐపీఎల్ బెట్టింగ్‌లు జిల్లాలో జోరందుకున్నాయి. మ్యాచ్ ప్రారంభానికి ముందే పందేలు మొదలవుతున్నాయి. ఎవరు టాస్ గెలుస్తారు? ఎవరు బ్యాటింగ్ ఎంచుకుంటారు? ఏ బ్యాట్స్‌మెన్ ఎన్ని పరుగులు చేస్తాడు? ఏ బౌలర్ ఎన్ని వికెట్లు తీస్తాడు? తదితర అంశాలతో పాటు ప్రతి బంతికి పందెం ఉంటుంది. ఇలా ఒక్కో ఆటగాడిపై వ్యక్తిగతంగానూ బెట్టింగ్ అధిక సంఖ్యలో సాగుతుంది. కొన్ని చోట్లు పోలీసులకు దొరక్కుండా కోడ్ భాషను ఉపయోగిస్తున్నట్లు సమాచారం.

నిఘా ఉంచాం



బెట్టింగ్‌లు ఆడుతున్న వారిపై నిఘా ఉంచాం. ఎక్కడైనా స్థావరాలు ఏర్పాటు చేసి బెట్టింగ్‌లు ఆడుతున్నారా అనే విషయాలను తెలుసుకుంటున్నాం. ఎవరైనా బెట్టింగ్‌లకు పాల్పడతుంటే పోలీసులకు సమాచారం అందించాలి. ఈ వ్యసనంతో కుటుంబం రోడ్డున పడాల్సి వస్తుంది. ఇప్పటికే యువతకు అవగాహన కల్పిస్తున్నాం.

– శ్రీనివాస్, డీఎస్పీ, పరిగి


లంకాదహనంలో టపాసుల వెలుగులు

హనుమంత వాహనంపై శ్రీనివాసుడు

శ్రీరామచంద్రమూర్తి అవతారంలో దర్శనం

కొడంగల్: మండల పరిధిలోని బాలాజీనగర్‌లో వెలసిన పద్మావతి సమేత మహాలక్ష్మీ వేంకటేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవాలు వైఖానస ఆగమ శాస్త్రోక్తంగా కొనసాగుతున్నాయి. ఈ ఉత్సవాల్లో భాగంగా సోమవారం శ్రీవారు శ్రీరామచంద్రమూర్తి అవతారంలో హనుమంత వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రాంగణం నుంచి జాతర స్థలం వరకు స్వామి వారి నామస్మరణతో వాహన సేవ కొనసాగింది. దారి పొడవునా భక్తులు రామచంద్రమూర్తికి హారతులిచ్చారు. మధ్యాహ్నం ఆలయ ఆవరణలో అభిషేకం వసంతోత్సవం నిర్వహించారు.


హాజరైన భక్తజనం


శ్రీరామచంద్రమూర్తి అవతారంలో హనుమద్వాహనంపై శ్రీవారు

అన్ని రంగాల్లో రిజర్వేషన్ కల్పించాలి


ఢిల్లీకి బయలుదేరుతున్న బీసీ యువజన సంఘం నాయకులు

- బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ కేటాయించాలి
- బీసీ యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాస్‌గౌడ్
- బీసీల పోరుగర్జనకు ఢిల్లీకి బయలుదేరిన నాయకులు

తాండూరు టౌన్: విద్య, ఉద్యోగ రంగాల్లోనూ బీసీలకు 42శాతం రిజర్వేషన్ కల్పించాలని బీసీ యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఈడిగ శ్రీనివాస్ గౌడ్ డిమాండ్ చేశారు. ఏప్రిల్ 2న న్యూఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద జరగనున్న బీసీల పోరుగర్జనకు సోమవారం చర్లపల్లి రైల్వే స్టేషన్ నుంచి బయలుదేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశ వ్యాప్త జనగణనలో భాగంగా కులగణన చేపట్టాలన్నారు. 50 శాతానికి పైగా ఉన్న ఓబీసీలకు కేంద్రంలో ప్రత్యేక బీసీ మంత్రిత్వ శాఖను కేటాయించాలన్నారు. ఆయన వెంట బీసీ యువజన నాయకులు విక్రమ్, నరేశ్, నర్సింహ, మల్లికార్జున్, విజయ్ తదితరులు ఉన్నారు.

వక్ఫ్ సవరణ బిల్లుతో అన్యాయం


బొంపల్లిలో ఈద్గా వద్ద నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న మైనార్టీ సంఘం నేతలు

దోమ: వక్ఫ్ సవరణ బిల్లుతో ముస్లింలకు తీరని అన్యాయం జరుగుతుందని, దీన్ని ప్రతీ ముస్లిం వ్యతిరేకిస్తున్నాడని ముస్లిం మైనార్టీ సంఘం బొంపల్లి నేతలు అన్నారు. రంజాన్‌ను పురస్కరించుకుని సోమవారం ఈద్గా వద్ద నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనల్లో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. అనంతరం పలువురు మాట్లాడుతూ.. ముస్లింల హక్కులను హరించడానికి కేంద్రం కుట్ర పన్నుతోందని ఆరోపించారు. ఇందుకు సంబంధించిన బిల్లు పార్లమెంట్‌లో ఆమోదం పొందితే దేశవ్యాప్తంగా ఉన్న ముస్లిం సమాజం తీవ్రంగా నష్టపోతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ సంఘం నేతలు నజీమ్, మహమూద్, ఖాజ, సదర్ ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.

ఆస్తి పన్ను వసూలులో 'పట్నం'రికార్డు


ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ కార్యాలయం

రూ.5 కోట్లు రాబట్టిన ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ

ఇబ్రహీంపట్నం: ఆస్తి పన్ను వసూలులో ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ తొలిసారి రికార్డు సాధించింది. రూ.5 కోట్ల మార్కును దాటి ఔరా అనిపించింది. గ్రామ పంచాయతీ నుంచి 2013లో నగర పంచాయతీగా, 2018 మున్సిపాలిటీగా ఇబ్రహీంపట్నం ఆవిర్భవించిన సంగతి తెలిసిందే. అయితే పట్టణం శరవేగంగా విస్తరిస్తున్నప్పటికీ.. తగిన ఆదాయం సమకూరడంలేదు. అధికారుల నిర్లక్ష్యం, అలసత్వం కారణంగా పన్ను వసూలులో వెనుకబడింది. ఈ సారి అధికార యంత్రాంగం పన్ను వసూలుపై ప్రత్యేక దృష్టి సారించింది. స్పెషల్ డ్రైవ్‌లు చేపట్టి అనుకూల ఫలితాలను సాధించింది.

పాత బకాయి రూ.7 కోట్లు

ప్రైవేట్, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంస్థలకు సంబంధించి సుమారు 7,239 భవనాల నుంచి ఆస్తి పన్నులు వసూలు కావాల్సి ఉంది. 2024–25 ఆర్థిక సంవత్సరం వసూలు లక్ష్యం రూ.11.50 కోట్లు కాగా, అందులో రూ.7 కోట్లు పాత బకాయే ఉంది. ఈ నేపథ్యంలో ఈ ఏడు 3,933 భవన యజమానుల నుంచి రూ.4 కోట్లు, 1,300 భవన యజమానుల నుంచి పాత బకాయి రూ.1.30 కోట్లను పుర అధికారులు రాబట్టగలిగారు. 2023– 24 ఆర్థిక సంవత్సరంలో రూ.4.42 కోట్లు, 2022– 23లో రూ.4.06 కోట్లు, 2021– 22లో రూ.3.21 కోట్లను వసూలు చేయగా.. ఈ ఆర్థిక సంవత్సరం ముగింపు రోజైన మార్చి 31 నాటికి రూ.5 కోట్ల 30 లక్షలు వసూలు చేశారు.

లక్ష్యం చేరుకున్నాం



ప్రత్యేక దృష్టితో గడిచిన ఆర్థిక సంవత్సరం ఆస్తి పన్ను వసూలు లక్ష్యం నెరవేర్చాం. రూ.5.30 కోట్లు వసూలు చేసి రికార్డు సాధించాం. సుమారు రూ.11.50 కోట్ల టార్గెట్‌లో రూ.7 కోట్లు పాత బకాయి ఉంది. అందులో ప్రభుత్వ సంస్థల బకాయే రూ.2.50 కోట్లు. ఈ సారి పాత బకాయి ఉన్న 1300 భవనాల యాజమానుల నుంచి రూ.1.30 కోట్లు వసూలు చేశాం. పాత బకాయి చెల్లించకుండా ప్రస్తుత ఆర్థిక సంవత్సరం పన్ను తీసుకునే వీలుండదు. పేరుకుపోయిన బకాయిలన్నింటిని వసూలు చేయలేకపోయాం.

– రవీంద్రసాగర్, కమిషనర్, ఇబ్రహీంపట్నం

జల్‌పల్లిలో ఏటీఎం పాక్షిక ధ్వంసం

పహాడీషరీఫ్: ఏటీఎం సెంటర్‌లోకి చొరబడిన ఓ వ్యక్తి మిషన్‌ను ధ్వంసం చేశాడు. ఈ సంఘటన పహాడీషరీఫ్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. ఆదివారం రాత్రి జల్‌పల్లి శ్రీరాం కాలనీలోని ఐసీఐసీఐ ఏటీఎంలోకి వెళ్లిన ఓ వ్యక్తి మిషన్‌ను ధ్వంసం చేసేందుకు యత్నించాడు. సోమవారం ఉదయం ఇది గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించగా, ఏటీఎం స్వల్పంగా ధ్వంసమైనట్లు నిర్ధారించారు. సాంకేతిక ఆధారాలను పరిశీలించిన అనంతరం మానసిక స్థితి సరిగా లేని ఓ వ్యక్తి ఇందుకు కారణమని తేల్చారు. అతన్ని అదుపులోకి తీసుకుని, అన్ని కోణాల్లో విచారణ చేస్తున్నామని వెల్లడించారు.

కారు ఢీకొని వ్యక్తి మృతి..

కుత్బుల్లాపూర్: కారు ఢీ కొనడంతో రోడ్డు దాటుతున్న వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. కొంపల్లి గార్డెన్ హౌసింగ్ సొసైటీకి చెందిన మహేంద్ర చౌదరి(34) ఆదివారం రాత్రి తన బంధువు లాలు చౌదరితో కలిసి సరుకులు కొనుగోలు చేసేందుకు కొంపల్లికి వచ్చాడు. పని ముగించుకున్న అనంతరం కొంపల్లి సినీ ప్లానెట్ వద్ద రోడ్డు దాటుతుండగా మేడ్చల్ నుంచి సుచిత్ర వైపు వెళుతున్న ఫార్చునర్ కారు అతడిని ఢీకొట్టింది. ఈ ఘటనలో అతడి తలకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

టీవీ రంగయ్యకు ఉగాది పురస్కారం


పురస్కారం అందుకుంటున్న టీవీ రంగయ్య

షాద్‌నగర్: నగరంలోని అమీర్‌పేట కమ్మ సేవా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం అక్కినేని నాగేశ్వర్‌రావు శతజయంతి సందర్భంగా ఆంధ్ర నాటక కళాపరిషత్ 96వ వార్షికోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన విశ్వావసునామ సంవత్సర ఉగాది వేడుకలో కళారంగానికి అత్యుత్తమ సేవలను అందిస్తున్న పట్టణానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు టీవీ రంగయ్యను ఉగాది పురస్కారంతో సన్మానించారు. కిమ్స్ ఆస్పత్రి అధినేత బొల్లినేని కృష్ణయ్య, కమ్మ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మేక రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి అన్నమనేని ప్రసాద్ చేతుల మీదుగా ఆయన ఉగాది పురస్కారాన్ని అందుకున్నారు. అనంతరం టీవీ రంగయ్య మాట్లాడుతూ.. ఆంధ్రనాటక కళాపరిషత్‌లో ఏఎన్ఆర్, ఎన్టీఆర్ లాంటి ఎందరో ప్రముఖ నటులు ప్రదర్శనలు ఇచ్చారని అన్నారు. అలాంటి సంస్థ తన సేవలను గుర్తించి పురస్కారాన్ని అందించడం ఆనందంగా ఉందన్నారు. పురస్కారానికి ఎంపిక చేసిన పెద్దలకు కృతజ్ఞతలు చెప్పారు. ఈ సందర్భంగా కళాభిమానులు రంగనాథం, బెజుగం రమేష్, వడ్ల రమేష్‌చారి, సింగారం శ్రీనివాస్, నారాయణచారి, మల్లికార్జునగౌడ, సత్యనారాయణ, బాలబ్రహ్మచారి, సుధాకర్ తదితరులు ఆయన్ను అభినందించారు.


గౌరారం-సాగారం తండా మార్గంలో ఆరబెట్టిన ధాన్యం

రహదారులే కల్లాలు

దుద్యాల్: మండల పరిధిలో పంట కోసిన రైతులు రోడ్లపైనే ధాన్యం ఆరబోస్తున్నారు. దీంతో ఎదురెదురుగా వాహనాలు వచ్చినప్పుడు ప్రమాదం జరిగే ఆస్కారం ఉందని పలువురు ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం చొరవ తీసుకుని కల్లాలు ఏర్పాటు చేసుకునేందుకు సహకరిస్తే రైతులు ఇటువంటి చర్యలకు పూనుకోరని వాపోతున్నారు. రైతులు రోడ్లపై ధాన్యం ఆరబెట్టవద్దని హెచ్చరిస్తున్నా కల్లాలు లేక తప్పడం లేదంటున్నారు రైతులు.

మార్కెట్‌లో తెగిన విద్యుత్ వైర్లు

తప్పిన పెను ప్రమాదం

- పాత విద్యుత్‌లైన్లను తొలగించాలని స్థానికుల డిమాండ్


ధారూరు కూరగాయల మార్కెట్లో రోడ్డుపై తెగిపడిన విద్యుత్ తీగలు

ధారూరు: ప్రధాన రోడ్డులో విద్యుత్ తీగలు తెగిపడటంతో ప్రజలు భయాందోళనల చెందారు. ఈ సంఘటన మండల కేంద్రంలోని కూరగాయల మార్కెట్లో సోమవారం చోటుచేసుకుంది. ముస్లింలు ప్రత్యేక ప్రార్థనల అనంతరం తిరిగి వస్తుండగా మార్కెట్‌లోని వాటర్ ట్యాంక్ సమీపంలో స్తంభం నుంచి తీగలు తెగిపడ్డాయి. ఆ సమయంలో జనసంచారం లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. అక్కడే ఉన్న ఓ బట్టల షాప్ యజమాని గమనించి విద్యుత్ సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో వెంటనే విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. లైన్‌మెన్ చెన్నయ్య, విద్యుత్ సిబ్బంది తీగలు సరిచేసి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. స్వాతంత్ర్యం వచ్చిన తొలినాళ్లలో వేసిన విద్యుత్ లైన్లు దెబ్బతిని తరచూ విద్యుత్ తీగలు తెగిపడుతున్నాయని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. విద్యుత్ అధికారులు, సిబ్బందికి విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు కల్పించుకుని వెంటనే నూతన విద్యుత్‌లైన్లు వేయించాలని కోరారు.

ఇంటి తాళం పగులగొట్టి చోరీ

- ఉక్కపోత భరించలేక మిద్దెపై నిద్రించిన కుటుంబం
- ఇంట్లోకి చొరబడి బంగారం, వెండి, నగదు దోచుకెళ్లిన దుండగులు

పరిగి: వేసవి తాపానికి తట్టుకోలేక ఇంటికి తాళం వేసిన ఓ కుటుంబం మేడపై పడుకోగా.. దొంగలు ఇల్లు గుల్ల చేసిన ఘటన హన్మగండితండాలో సోమవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. తండాకు చెందిన మూడావత్ శ్రీను ఆదివారం రాత్రి ఇంటికి తాళం వేసి కుటుంబం మొత్తం మిద్దెపై పడుకున్నారు. గుర్తు తెలియని వ్యక్తులు తాళం పగలగొట్టి ఇంట్లోని బీరువాను ధ్వంసం చేసి తొమ్మిది తులాల బంగారం, అర కిలో వెండి, రూ.60 వేల నగదును దొంగలించుకుపోయారు. ఉదయం లేచి చూడగా ఇల్లు, బీరువా తాళాలు పగలగొట్టి ఉన్నాయి. ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎస్ఐ సంతోష్‌కుమార్ ఘటన స్థలానికి చేరుకుని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎల్‌ఆర్‌ఎస్ రాయితీ గడువు పెంచేనా!

- ముగిసిన 25 శాతం రాయితీ గడువు
- ఫీజు చెల్లించిన 1,918 ప్లాట్ల దరఖాస్తు దారులు
- ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీకి రూ.8.70 కోట్ల ఆదాయం


చివరిరోజు ఎల్‌ఆర్‌ఎస్ చెల్లింపునకు వచ్చిన దరఖాస్తుదారులు

ఇబ్రహీంపట్నం: అక్రమ లే అవుట్ ప్లాట్ల క్రమబద్ధీకరణ (ఎల్‌ఆర్‌ఎస్)కు 25 శాతం రాయితీతో ప్రభుత్వం ఇచ్చిన గడువు సోమవారంతో ముగిసింది. ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుదారుల నుంచి ఫీజుల రూపేణ ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీకి రూ.8.70 కోట్ల ఆదాయం సమకూరింది. ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ 14,053 ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులుండగా సోమవారం నాటికి 1,918 దరఖాస్తుదారులు ఫీజులు చెల్లించారు.

ఆరంభంలో ఇబ్బంది

ఎల్‌ఆర్‌ఎస్ ఫీజుల చెల్లింపు అంశాలపై మొదట్లో అవగాహన లేకపోవడం, సాంకేతిక లోపాల కారణంగా మొదటి మూడు వారాల్లో దరఖాస్తుదారులు ముందుకు రాలేదు. గడిచిన వారం రోజులగా ఫీజులు చెల్లించేందుకు ముందుకు వస్తున్నారు. వేలాది రూపాయల ఫీజులు, తక్కువ సమయం ఉండటం వలన చెల్లింపుదారులు ఇబ్బందులకు గురయ్యారు. ఫీజులు చెల్లించాలా వద్దా..? ఇప్పుడు అవసరమా అనే మీమాంసలో పడ్డారు. ఇప్పటికే ఆయా ప్లాట్లు రెండుమూడు చేతులు మారడం ఎల్‌ఆర్‌ఎస్ చెల్లింపులు మందకొడిగా సాగేందుకు ఓ కారణం. 25 శాతం ఫీజు రాయితీతో ఎల్‌ఆర్‌ఎస్ గడువును పెంపుపై ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో వేచిచూడాల్సిందే.